# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త






## స్పందనకు 174 అర్జీలు



చిత్తూరు, జవనరి 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టర్ హరి నారాయణన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి ఈ వారుం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల ద్వారా 174 అర్జీలు అందాయి. ఈ అర్జీలను పరిశీలించిన కలెక్టర్, జిల్లా అధికారులు సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 79, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి 5, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ ఆఫ్ స్టాంప్స్, పోలీసు శాఖల నుండి రెండేసీ సమస్యలు, ఇతర శాఖల నుండి 9 సమస్యలు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఏ పిడి డిఎంకె తులసీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భక్తుల సేవకు పునరంకితం!

### టిటిడి ఇఓగా ధర్మారెడ్డి బాధ్యతలు

తిరుమల, జనవరి 2 ప్రభాతవార్తప్రతినిధి:



వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్ళిన టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి సెలవులు పూర్తికావడంతో సోమవారం సాయంత్రం తిరిగి పూర్తిస్థాయి ఇఓగా బాధ్యతలు చేపట్టారు. భక్తుల సేవకు పునరంకిత మవుతానని అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రాష్ట్రదేవదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, టిటిడి ఇఓ(అదనపు బాధ్యతలు) అనిల్ కుమార్ సింఘాల్ నుంచి ధర్మారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో బంగారు వాకిలివద్ద ఇఓగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇన్‌ఛార్జి అదనపు ఇఓ, తిరుపతి జెఇఓ వీరబ్రహ్మం ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆలయం లోనికి చేరుకుని దేవదేవుడి శ్రీవారి దర్శనం చేసుకుని ఆశీస్సులందుకున్నారు.

### పవిత్ర ధనుర్మాసాన

## బంగారురథమెక్కిన "మలయప్ప"





తిరుమల, జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రమైన ధనుర్మాసంలో....వైకుంఠ ఏకాదశి ఘడియల్లో సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరుడు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి మహోన్నత బంగారు రథంపై భక్తులను కటాక్షించాడు. ఆలయం వద్ద అర్చకులు కర్పూరహారతులిచ్చి ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణగా ఊరేగించారు. స్వర్ణరథంముందు భక్తులు గోవిందా... వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో స్వయంగా ఈ రథాన్నిలాగి భక్తి పారవశ్యంతో పునీతులయ్యారు. స్వర్ణరథోత్స వంలో జీయ్యర్‌స్వాములు, టిటిడి అధికారులు, పాలకమండలి పాల్గొన్నారు.

## ముందస్తు ప్రణాళికలు....పక్కాగా అమలు!

### సాఫీగా... సంతృప్తిగా వైకుంఠద్వార దర్శనం -సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యత



తిరుమల, జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:

ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియలతో బాటు ఏడుకొండల్లో వెంకన్న ఆలయంలో పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు ప్రశాంతంగా కల్పించేందుకు టిటిడి పాలక మండలి, అధికారులు నెల రోజుల నుంచి రూపొందించిన పక్కాప్రణాళికలు, అమలుచేసిన విధానంతో ప్రముఖులతో బాటు సామాన్యభక్తులు సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనంచేసుకున్నారు. ఏకాదశి పర్వదిన ఘడియల్లో సోమవారం వేకువ జామున 2.15గంటలనుంచి నిరంతరాయంగా ఉదయం 6గంటల వరకు రాజ్యాంగహోదాలోని ప్రముఖులతో బాటు రాజకీయ, సినీ ప్రముఖులు కూడా వైకుంఠద్వార దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. టిటిడి పాలక మండలి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్, ఇన్‌ఛార్జి అదనపు ఇఓ వీరబ్రహ్మం, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ,వేదపండితుల వేదమంత్రోచ్చరణ, ప్రత్యేక పూజలతో ఆలయంలోని వైకుంఠద్వారం తెరిచి భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా రూపొందించుకున్న ప్రణాళికలుఅమలు చేయడంతో అందరికీ ఆనందం కలిగింది. రాష్ట్రమంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేణుగోపాల్, ఎంపిలు మోపిదేవి వెంకటరమణ, డాక్టర్ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కర్నాటక మాజీ సిఎం దేవేగౌడ కుమారుడురేవన్న, ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ జెఇఓ కెఎస్ శ్రీనివాసరాజు, ఎమ్మెల్సీ కృష్ణయ్య, సినీనటుడు రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

**సకలం సంతోషంగా ఈ ఏడాదీ వైకుంఠద్వారం**

గత రెండు సంవత్సరాలుగా తిరుమల ఆలయంలోని వైకుంఠద్వార దర్శనాలనుపదిరోజులపాటు తెరచి భక్తులకు దర్శనం చేయిస్తుండటంతో సామాన్యభక్తులు సంతృప్తి వ్యక్తం చేసేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్లు జారీచేయడంతో సామాన్యభక్తులు ఆయా రోజుల్లోనే ముందుగా తిరుమలకు చేరుకుని గోవింద మాలలు ధరించి గోవిందనామాలతో వైకుంఠద్వార దర్శనం చేసుకునే భాగ్యం కలిగింది. సోమవారం అర్ధరాత్రి వరకు సరాసరి 65వేలమంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించినట్లు టిటిడి వర్గాల సమాచారం. వీరిలో ప్రముఖులు కూడా ఉన్నారు. ఆలయంలో అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు రద్దుచేయడం, విఐపి బ్రేక్ నిలుపుదలచేయడం, ఆర్జిత సేవలు ఏకాంతంగా జరిపించడంవంటివి సామాన్యభక్తులకు మరింతగా దర్శనం చేసుకునే సమయం లభిస్తుంది.

### శేష, యాళి వాహనాలపై

## స్వామి అమ్మవార్ల దర్శనం



శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త

వైకుంఠ ఏకాదశి సందర్భంగా బంగారు శేషవాహనంపై శ్రీకాళహస్తీశ్వరస్వామి, బంగారు యాళి వాహనంపై అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోయిలు ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారిని బంగారు శేషవాహనంపై, అమ్మవారిని బంగారు యాళివాహనంపై ఆశీనుల్ని చేసి పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవాన్ని ధర్మకర్తల మండలి చైర్మెన అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ, సుమతి, ప్రత్యేకాహానితులు ఎంపి శ్రీదేవి, జూలుగంటి సుబ్బారావు, నరసింహారాజు, సుబ్బరాయులు, లక్ష్మీపతి రెడ్డి వెంటరాగా టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, రాజా, శేఖర్, ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ వెంటరాగా గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎఎస్ఐ జనార్ధన్‌నాయుడు, వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు.

## చేనేత కళాకారులను ప్రోత్సహించాలి

### -జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపు



తిరుచానూరు, జనవరి 2 ప్రభాతవార్త:

చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించి వారి జీవనోపాధికి తమవంతు ప్రోత్సాహం అందించాలని నగర ప్రజలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వస్త్ర మేళా 2వ తేదీ నుండి సంక్రాంతి పండుగ ముగిసే వరకు ఉంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని చేనేత కళాకారులు తమ స్వహస్తాలతో రూపొందించిన వివిధ రకాల ఉత్పత్తులు నగరవాసులకు ఒకే చోట దొరకడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం సిఇఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి, విజయవాడ చేనేత శాఖ సూపరింటెండెంట్ ఢిల్లిబాబు, జిల్లా పర్యాటక శాఖాధికారి రూపేందర్‌రెడ్డి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, శిల్పారామం పాలనాధికారి ఖాదర్ వలి, సిబ్బంది, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## 5 నాటికి దోష రహిత ప్రత్యేక ఓటర్ల జాబితా

### జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు పిఎస్ ప్రద్యుమ్న



ఓటర్ల జాబితాపై అధికారులతో ఎలక్టోరల్ పరిశీలకులు పిఎస్ ప్రద్యుమ్న సమావేశం

చిత్తూరు, జనవరి 2 ప్రభాతవార్త:

ఈ నెల 5వ తేదీ నాటికి దోష రహిత ఓటర్ల ప్రత్యేక జాబితాను సిద్ధం చేయాలని చిత్తూరు జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2023పై నియోజకవర్గ ఇఆర్ఓలతో ఎలక్టోరల్ పరిశీలకులు పిఎస్, ప్రద్యుమ్న, కలెక్టర్ హరినారాయణన్, డిఆర్ఓ రాజశేఖర్‌లు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను జనవరి 5వ తేదీకి సిద్ధం చేయడానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. జెండర్ రేషియోతో పాటు ఓటర్ల జాబితాకు ఆర్ అనుసంధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓటర్‌కు ఆధార్ అనుసంధానం 90 శాతం పూర్తి చేశామని, ఎమ్మెల్సీ ఫైనల్ ఓటర్లకు సంబంధించి చిత్తూరు జిల్లాలో గ్రాడ్యుయేట్స్ 54,287, ఉపాధ్యాయులకు సంబంధించి 3,547 ఓటర్లు వున్నారని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ డాక్టర్ రేణుక, శివయ్య, సృజనలు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏసి బస్సుల పనితీరును పరిశీలించిన టిఆర్‌బి సెక్రటరీ



తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 2 ప్రభాతవార్త:

తిరుపతి-తిరుమల మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన ఏసి బస్సుల పనితీరు ఎలా ఉందో ఏపిఎస్‌ఆర్‌టిసి టిఆర్‌బి సెక్రటరీ పిఎస్.ప్రద్యుమ్న సోమవారం స్వయంగా పరిశీలించారు. ఏసి బస్సులో తిరుపతి నుండి తిరుమలకు ప్రయాణించి ఆ బస్సులోని ప్రయాణీకులతో విద్యుత్ బస్సులో ప్రయాణం ఎలా ఉందోనని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రయాణీకుడు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డితో ఆయన మాట్లాడుతూ తిరుమలనుండి దూరప్రాంతాలకు ఏసి బస్సులను నడిపేందుకు ఉన్నఅవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

## పులివెందులతో సమానంగా పుంగనూరు అభివృద్ధి : మంత్రి పెద్దిరెడ్డి



చౌడేపల్లి, జనవరి 2 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పులివెందులతో ధీటుగా పుంగనూరు అభివృద్ధి పతంలో పయనిస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పల్లెబాటలో భాగంగా ఆయన మండలంలోని పరికిదొన, గడ్డంవారిపల్లి, చౌడేపల్లి పంచాయతీల్లోని 21గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన స్వేచ్ఛతో నియోజకవర్గం అభివృద్ధి వైపు దూసుకెళుతోందన్నారు. గతంలో ఒక కుటుంబ పాలనలో 30యేళ్ళు అధికారంలో ఉన్నపట్టికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదని గుర్తు చేసారు. పుంగనూరును అగ్రగామిలో పెట్టాలని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కంకణం కట్టుకొన్నారన్నారు. నియోజకవర్గంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టామన్నారు. ప్రతి గ్రామానికి మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేసి గండికోట రిజర్వాయర్ నుంచి హంద్రీ-నీవా ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరందే చర్యలు చేపడుతున్నామనీ, తద్వారా ప్రతి ఇంటికి కోళాయిల ద్వారా నేరుగా ఇళ్ళల్లోకే వస్తాయన్నారు. అంతేకాకుండా సాగునీటికోసం ఆవులపల్లి, నేతిగుంట్లపల్లి, ముదివేడుల్లో ప్రాజెక్టులు నిర్మిస్తున్నామన్నారు. గాంధీజీ మార్గంలో సచివాలయాలు ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పేదరికమే కొలబద్దగా పారదర్శక పాలన అందించి, సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా పరుగులు పెట్టించిన ఘనత వైకాపా ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఇన్నేళ్ళ రాజకీయ జీవితంలో నియోజకవర్గ అభివృద్ధిని చూడలేదనీ, చిన్న పొరపాట్లను చంద్రబాబు రాజకీయం చేస్తున్నారన్నారని విమర్శించారు. అనంతరం పలు గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆర్‌బికే భవనాలను ప్రారంభించారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, నియోజకవర్గ పరిశీలకులు జింకా చలపతి, జడ్పీటీసీ ఎన్.దామోధర్ రాజు, ఎంపిపి జి.రామ్మూర్తి, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, వైకాపానాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

### ఉష్ణోగ్రతలు

2/1/2023



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 31 డిగ్రీలు
- వెంకటగిరి 32 డిగ్రీలు
- గూడూరు 32 డిగ్రీలు

### బంగారం ధరలు

2/1/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 150

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,618

### కోడిగ్రుడ్ల ధరలు

2/1/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## కాణిపాకంలో నేత్రపర్వంగా ఉత్తరద్వార దర్శనం



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉభయ దేవేరులతో కలసి రామ పురవీదుల్లో ఊరేగుతున్న వరదుడు

కాణిపాకం, జనవరి 2 ప్రభాతవార్త:

ముక్తిని ప్రసాదించే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి పెరియదేవి సయిత శ్రీవరదరాజస్వామి ఆలయంలో సోమవారం ఉత్తరద్వార దర్శనం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల అధ్వర్యంలో ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి మూలవిరాట్‌లకు ఉదయం ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వార్లకు ఛైర్మన్ మోహన్‌రెడ్డ, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ఆలయం నుండి పట్టువస్త్రాలను, పూజా సామాగ్రిని సోమవారం ఉదయం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్ళి ఆలయ అర్చకులకు సమర్పించారు. ఈమేరకు వేకువజామున ఆలయంలో స్వామివారి అమ్మవార్లకు ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి ఉత్సవమూర్తులను పవిత్రమైన ఉత్తరద్వారం వైపు వుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఇదిలా వుండగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరదరాజస్వామివారి ఆలయాని న్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

**ఘనంగా గ్రామోత్సవం**

వైకుంఠ ఏకాదశి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు సోమవారం ఉదయం గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఉదయం ఉత్తర ద్వారా దర్శనం కల్పించిన అనంతరం అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు రమేష్, బాబు, ఆలయ మాజీ బోర్డు సభ్యులు టీజీ మహేశ్వరనాయుడు, అర్చకులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



ధ్వజ స్థంభానికి చేపట్టిన ప్రత్యేకాలంకరణ

## చేమూరులో వైద్యశిబిరం-పలువురికి వైద్యపరీక్షలు

తొట్టంబేడు, జనవరి 2 ప్రభాతవార్త




కాసరం వైద్యాదికారిణి డాక్టర్ అనూష ఆధ్వర్యంలో మండలంలోని చేమూరు గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆశ మరియు ఏఎన్ఎంల ద్వారా ప్రతి ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి జ్వరాలు ఎవరికి ఉన్నాయో సమాచారం తెలుసుకుని వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందుకే ముందస్తు చర్యగా గ్రామంలోవైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారిణి తెలిపారు. జ్వరం ఉన్న ప్రతి ఒక్కరికి మాత్రలు పంపిణీచేశారు. ప్రతి ఒక్కరు కాచివడపోచిన నీటిని తాగాలని సూచించారు. కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ శాంతకుమారి, ఎఎన్ఎం రోజా, ఎంఎల్‌హెచ్‌పి జలజ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:



విద్యార్థులు తమ కేరీర్‌పై అవగాహన కలిగి వుండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలిక వసతి గృహం నందు వే ఫౌండేషన్ వారిచే విద్య, ఉద్యోగ సోపాన యాత్ర కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల కేరీర్ ఎదుగుదల కోసం వే ఫౌండేషన్ ఆధ్వర్య ంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవడం ఎలా అనే దానిపై మార్గదర్శిని అనే బుక్‌లెట్‌ను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈయాత్ర వాహనాన్ని స్థానిక మూలస్థాన ఎల్లమ్మ దేవస్థానం ప్రాంగణంలో స్థానిక ఎంపీటీసీ, డాక్యుమెట్ రైటర్ ఎం.కేశవులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స ంస్థ నిర్వహకులు డాక్టర్ చంద్రకిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, ఎఈఈఓ లలితకుమారి,వార్డన్లు చందన, మాలతి, షాహ తదితరులు పాల్గొన్నారు.

## వికృతమాల ఆలయంలో పోటెత్తిన భక్తులు!

-అందరికీ సౌకర్యవంతంగా దర్శన సౌకర్యం కల్పించాం

-ఆలయ ధర్మకర్త డా॥పసుపులేటి హరిప్రసాద్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 2 ప్రభాతవార్త:



సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట సమీపంలోని వికృతమాల గ్రామంలో వెలసిన శ్రీ సంతాన సంపద వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తిరుపతి నుండి అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి దర్శించు కున్నారు. ఉదయం 6 గంటల నుండి ఆలయంలో స్వామివారికి ఆలయ ధర్మకర్త డా॥పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు సౌకర్యవంతమైన వైకుంఠద్వార దర్శనం కల్పించడం జరిగిందన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వచ్చిన వేలాది మంది భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదం,మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు.

## గంగమ్మ సింహవాహనానికి విరాళాలు

తిరుపతి,జనవరి 2ప్రభాతవార్త:



తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంటగంగమ్మకు తిరుపతికి చెందిన దాతలు బంగారుసింహవాహనం తయారీకి విరాళాలు ఇచ్చారు. సోమవారం ఉదయం తిరుపతికి చెందిన ప్రభావతి లక్ష్మీనారాయణ 1.71లక్షల రూపాయలు, రంగు కవిరాజబాబు51వేల రూపాయలు విరాళమిచ్చారు. ఈ విరాళాలను ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఆలయ ఇఓ ఎం.మునికృష్ణయ్యకు అందజేశారు.

## ఎమ్మెల్యే భూమనకు డాక్టర్ సుధారాణి శుభాకాంక్షలు

తిరుపతి,జనవరి 2ప్రభాతవార్త:



నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభం సందర్భంగా శ్రీసాయిసుధా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత్రి డాక్టర్‌రాళ్ళపల్లి సుధారాణి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని సోమవారం కలిశారు. మర్యాదపూర్వకంగాకలిసిన ఈ సందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి ,దుశ్శాలువతో సన్మానించారు.

## భక్తులకు ప్రసాద వితరణ

తిరుపతి,జనవరి 2ప్రభాతవార్త:



వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం తిరుపతి కొత్తవీధిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయంలోపల వైకుంఠద్వార దర్శనం చేయించిన పాలకమండలి,అర్చకులు అనంతరం రాయలసీమ రంగస్థలి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, కవిత, దీపక్‌యాదవ్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు భక్తులకు ప్రసాదాలు పంపిణీచేశారు.

## విద్యాశాఖాధికారికి ఘనసత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండల విద్యాశాఖాధికారి ఆర్.భువనేశ్వరికి నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో సిబ్బంది ఆమెను దుశ్శాలువతో సత్కరించి మెమొంటోను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో మట్లాడుతూ సిర్బీలు బాధ్యతగా వ్యవహరించాలని వారివారికి కేటాయించిన విధులనుసక్రమంగా నిర్వహించాలని కోరారు. తనకు సహకరిస్తున్న సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాధవయ్య, లలిత, ప్రశాంత్, మునిమోహన్, ధనశేఖర్, కృష్ణయ్య, ప్రసాద్, ప్రదీప్‌కుమార్, శాంతి, దేవిప్రియ, లలిత, హేమలత, సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## రౌతుసూరమాలలో ఇదేం ఖర్మ.. కార్యక్రమం

.తొట్టంబేడు, జనవరి 2 ప్రభాతవార్త



ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని దోచుకున్నారని తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని రౌతుసూరమాల పంచాయతీలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంను మండలపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ బొజ్జలగోపాలకృష్ణారెడ్డి, దివంగతనేత ఆలయ ఛైర్మన్ పోతుగుంటగురవయ్యానాయుడుల సహకారంతో ఇక్కడ పరిశ్రమల కేంద్రంగా ఏర్పడిందని, అయితే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వివరించారు. కాకుండా పంచాయతీలోని వృద్ధాప్య ఫించన్లు, వితంతు ఫించన్లు, ఒంటరి మహిళ ఫించన్లు, విద్యుత్‌లైన్లు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని నేడు నిరుపేదలు కూడా జీవనం సాగించే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు సునీల్, సుబ్బయ్య, ప్రేమ్‌కుమార్, వెంకటకృష్ణయ్య, సురేష్, కన్నలిరత్నయ్య, గోపి, గంగమ్మ, గురవయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిసి నాయకులు ఫ్లెక్సీలను చించివేయడం దారుణం

శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త



బిసి నాయకులు ఫ్లెక్సీలను చించివేయడం దారుణమని పలువురు తెలుగుదేశంపార్టీ బిసి నాయకులు తెలిపారు. ఈసందర్భంగా పలువురు బిసి నాయకులు మాట్లాడుతూ వైసిపి పెద్దలు బిసిలను ఎంతో బాగా చూసుకుంటున్నామని చెప్పుకుంటూ, బిసిలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఓర్వలేక వాటిని చించివేయడం చూస్తే వైసిపికి బిసిలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. శ్రీకాళహస్తిలో వైసిపి నాయకులు ఉద్దేశ్యపూర్వకంగానే తెలుగుదేశం ఫ్లెక్సీలను చించివేయడం చూస్తుంటే దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. సుధీర్‌రెడ్డి బ్యానర్‌లను చూస్తేనే బయపడుతుంటే వైసిపి ఓటమికి తప్పదని తెలిపారు. ఫ్లెక్సీలు చించివేసిన వారిపై వెంటనే చర్యలుతీసుకోవాలని టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరదాచారి, కాసరం రమేష్, మిన్నల్‌రవి, వెంకటేశ్వర్లు, ఉమేష్‌రావు, మునిరాజయాదవ్, కిషోర్, గుర్రప్పశెట్టి,ఖాదర్‌బాషా, జిలానీబాష, డివినారాయణ, డిల్లీబాబు, భాస్కర్, గోవింద్, సన్నీ, రామకృష్ణ, వెంకయ్యబాబు, బాలసుబ్రమణ్యం, యాదగిరి, హేమంత్, మణి, హరిబాబు మరియు తెదేపా నేతలు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి ఘన సన్మానం

కేవీబి పురం, జనవరి 2 ప్రభాతవార్త:



నూతన సంవత్సరం సందర్భంగా కేవీబీ పురం తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డిని సోమవారం రెవెన్యూ సిబ్బంది, క్షేత్ర సహాయకులు ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీటీ మునిరత్నం, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్‌వోలు ముని గోపాల్, ఈశ్వరయ్య, ముని భాస్కర్, దేవరాజులు, రఘు తదితరులు పాల్గొన్నారు. న ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామచంద్రయ్యను సోమవారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పలువురు మండల స్థాయి అధికారులు ఎంపీవోను ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## అప్పలాయగుంటలో ఉచిత ప్రసాదాలు పంపిణీ

వడమాలపేట, జనవరి 2 ప్రభాతవార్త:

వైకుంఠ ఏకాదశి సందర్భంగా రేణిగుంట మండలంలోని శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం వారు భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. అప్పలాయగుంటలో స్వామివారి పర్వదినాల్లో గత 15 సంవత్సరాలుగా ఈ సంఘం సభ్యులు ఉచిత ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం

పుత్తూరురూరల్, జనవరి 2 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని పలు ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాల నేపథ్యంలో నిత్య ఆరాధనలు జరుగుతున్నాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్ బాబు ఆలయ కమిటీ సభ్యులు మహావిష్ణువు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఉత్తర ద్వార దర్శనం ప్రారంభించారు. అలాగే బ్రహ్మంగారి దేవాలయం, షిరిడీ సాయిబాబా ఆలయంలో నేడు మంగళవారం ఉత్తర ద్వార దర్శనం, శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వరస్వామి ఆలయంలో సోమవారం, మంగళవారం ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు. ద్రౌపదీదేవి రామలింగేశ్వర స్వామి ఆంజనేయస్వామి, ఎగువ కనకంపాళెంగ్రామంలోనిశ్రీరాజరాజేశ్వరిఆలయంలో కూడా విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మండల పరిధిలోని శివాలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ రాధా గోవింద మందిరం(పుత్తూరు ఆర్టీసీ కాలనీ)లో కూడా ఉత్తర ద్వార ఏర్పాటు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణతోసుందరంగాఅలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## ఉప విద్యాశాఖ అధికారికి ఘన సన్మానం

పుత్తూరురూరల్, జనవరి 2 ప్రభాతవార్త:



నూతన సంవత్సర సందర్భంగా పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి పి.రఘురామయ్యాని పుత్తూరు డివిజన్ ప్రధానోపాధ్యాయులు సంఘం సన్మానించారు. డివిజన్ ప్రధానోపాధ్యాయులు జిల్లా గౌరవ అధ్యక్షుడు చెంగల్రాజు, రాష్ట్ర కన్వీనర్ ఆనందబాబు, సభ్యులు సుబ్బరాయన్, రాజారాం, ధనంజయులు, మోహన్‌రాం, వసుమతి, పుత్తూరు ప్రధానోపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్రీడల వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి : తులసిరామ్‌రెడ్డి

రేణిగుంట, జనవరి 2 ప్రభాతవార్త:



ప్రగతి సంస్థ ద్వారా రేణిగుంట మండలం ఆర్ మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతి కో-ఆర్డినేటర్ తులసిరాం రెడ్డి మాట్లాడుతూ క్రై బెంగళూరు సహాయంతో ప్రగతి సంస్థ క్రీడా పరికరాలు పంపిణీ చేశామన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లోని క్రీడా ప్రతిబను వెలికి తీసి వివిధ క్రీడల్లో పాల్గొనేలా చేయాలన్నారు. క్రీడల ద్వారా వారిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రగతి రేణిగుంట మండల కో-ఆర్డినేటర్ జయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు యాదయ్య, చిట్టిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మనసున్న మారాజు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ప్రభాకర్, నాగేషం

రేణిగుంట, జనవరి 2 ప్రభాతవార్త:



పేదలకు సాయం చేయడంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మనసున్న మారాజు అని రేణిగుంట పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నాగేషం సంయుక్తంగా అన్నారు. రేణిగుంట పోస్టాఫీస్ వీధికి చెందిన పేద ముస్లిం మహబూబ్ జానీ కుటుంబానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అందజేసిన పదివేలు నగదును సోమవారం వైకాపా పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నాగేషం అందజేశారు. మహబూబ్ జానీ గుండెపోటుకు గురై మృతి చెందిన విషయం తెలుసుకుని మధుసూదన్‌రెడ్డి ఆ కుటుంబానికి తక్షణం సాయంగా 10 వేలు పట్టణాధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నాగేషం ద్వారా మృతుని కుటుంబానికి పంపారు. నగదును అందజేసిన వారితో పాటు వైసీపీ పార్టీ ముస్లిం మైనారిటీ పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, వార్డు మెంబరు ఇరానీ ఖాదర్, ఎలక్ట్రికల్ మాబ, రమేష్ రాయల్, మస్తాన్, కుర్షిద్, నుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద ఎత్తున అన్నదానం

రేణిగుంట, జనవరి 2 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణం రైల్వేస్టేషన్ వద్ద రేణిగుంట రైల్వేస్టేషన్ సిద్ధి వినాయక టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ముందుగా ఇరు యూనియన్ సభ్యులు శ్రీవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు ప్రయాణికులకు, యాత్రికులకు పంచిపెట్టారు. స్వామివారి పూజలో రైల్వే ఐపీఎఫ్ ఎం.సందీప్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వైకుంఠ ఏకాదశి నాడు సుమారు వెయ్యి మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నదానం చేసిన వారిలో ఎస్‌జీ ప్రకాష్, కిరణ్, రాజా, పార్థసారథి, ప్రదీప్, విక్కీ, విలియమ్స్, మహ్మద్, శ్రీనివాసులురావు, నాగరాజు, రమేష్, రవి, వాసు, సునీల్, ముస్తక్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏడాదికి వరదరాజస్వామి కొత్త ఆలయం సిద్ధం

చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త



వచ్చే వైకుంఠ ఏకాదశి నాటికి ప్రసన్న వరదరాజస్వామి ఆలయం జీర్ణోద్ధారణ పూర్తి చేసి కొత్త ఆలయాన్ని ప్రారంభిస్తామని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. సోమవారం ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో భక్తుల దర్శనాలు,ఏర్పాట్లను పర్యవేక్షించారు.అలాగే వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు.ఇక్కడకు వచ్చిన వేలాది మంది భక్తులకు ప్రసాదాల వితరణ కార్యక్రమాల్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయంజీర్ణోద్ధారణ క్రమంలో మూల విరాట్టు దర్శన భాగ్యం కల్పించలేకపోయామని వివరించారు. ఇక్కడ పనులకు సంబంధించి టెండర్లు పూర్తి చేసామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునిత,రమాప్రభ, లక్ష్మీ, పసల సుమతి, శ్రీదేవిలు హాజరయ్యారు. కాగా వచ్చిన భక్తులకు ఏర్పాట్లు, సుదర్శనం ను ఎఇఓ లోకేష్‌రెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, కొండూరు నరసింహారాజు, భాస్కర్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

శ్రీకాళహస్తి రూరల్, జనవరి 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఏర్పేడు మండలాల సరిహద్దులోని ఓ ప్రైవేటు కర్మాగారం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. అయితే ఇది ఏ పోలీసు స్టేషన్ పరిధిలో వస్తుందనేది వివాదాస్పదంగా మారింది. హద్దులు ఏర్పాటు చేసుకోవాల్సిన పోలీసులు పట్టించుకోక పోవటంతో ఇక్కడ ప్రమాదాలు జరినపుడు రెండు పోలీసుస్టేషన్ల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి.ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన రాజా (27) అక్కడి కక్కడే మృతి చెందాడు. కుంట్రపాకం రాజు లాంకో కర్మాగారంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామానికి తన స్నేహితుని కలుసుకోవటానికి తన ద్విచక్రవాహనంలో వెళుతుండగా తిరుపతి వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. శ్రీకాళహస్తి రూరల్ ఎస్ ఐ వెంకటేష్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి లారీ డ్రైవర్ షణ్ముంగంను అదుపులో తీసుకున్నట్లు వివరించారు

## రేపు కొత్త పెన్షన్లు పంపిణి

శ్రీకాళహస్తి రూరల్,జనవరి 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నూతనంగా మంజూరు అయిన పెన్షన్లను బుధవారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంపిణికి సిద్ధం చేస్తున్నారు. ఎంపిడిఓ ప్రేమ్ రాజ్‌కుమార్ సారథ్యంలో ఏర్పాట్లు చేపట్టారు. నియోజకవర్గంలో 1274 కొత్త పెన్షన్లు మంజూరు అయినట్లు వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 253,శ్రీకాళహస్తి మండలంలో 266, తొట్టంబేడులో 208,ఏర్పేడులో 260,రేణిగుంట 287 పెన్షన్లు మంజూరు అయినట్లు తెలిసింది. కొత్త పెన్షన్ దారులకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సారథ్యంలో పంపిణికి ఏర్పాట్లు చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శనీయం

గడప గడపకు మన ప్రభుత్వంలో రేషన్ డీలర్ సస్పెండ్

ఏఎస్ఓకు ఆదేశాలు ఇచ్చిన ఎమ్మెల్యే భూమన

తిరుపతి కార్పొరేషన్, జనవరి 2, ప్రభాతవార్త



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 33వ డివిజన్ కొర్లగుంట మెయిన్ రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శనీయమన్నారు. అందుకే నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నామని తెలిపారు. కొర్లగుంట మెయిన్ రోడ్‌లో గడపగడప కార్యక్రమంలో మహిళలు గత ఆరు నెలల నుండి చక్కెర, కందిపప్పు ఇవ్వడం లేదని, బియ్యం మాత్రమే ఇస్తున్నారని ఎమ్మెల్యేకి మహిళలు ఫిర్యాదు చేశారు. వెంటనే రేషన్ డీలర్ కుమార్‌ను సస్పెండ్ చేయ్యమని చరవాణి ద్వారా ఏఎస్ఓను ఆదేశించారు. అక్కడున్న మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ డా. శిరీష, కార్పొరేటర్లు కుమారి, రామస్వామి, వెంకటేశ్వర్లు, నగర పాలక అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, వైసిపి నాయకులు దొడ్డ రెడ్డి సిద్ధారెడ్డి, శివకుమార్, శేఖర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వార్షిక అభివృద్ధి పనుల ఆమోదం

సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి

చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:



చంద్రగిరి పంచాయతీలో జరుగుతున్న, చేపట్టబోవుచున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ ఆమోదించినట్లు సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి తెలిపారు. స్థానిక పాత మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుత 2023-2024 ఏడాదికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సదరు ప్రణాళికలు పంచాయతీ సభ్యుల ఆమోదం పొందినట్ల తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిడిఓ రమేష్‌బాబు, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, అజీజానుస్రత్ బహార్, హౌసింగ్ ఏఈ రాము, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు మండల విద్యార్థులు

రామచంద్రాపురం, జనవరి 2 ప్రభాతవార్త:



రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు మండలానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం సొరకాయలపాళ్యం జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ గత నెల 30న నగిరి మండలం, ఏకాంబర కుప్పంలో జరిగిన త్రోబాల్ పోటీలలో సొరకాయల పాళ్యంకు చెందిన 8వ తరగతి విద్యార్థినికి ప్రణవి ఎంపికయ్యిందన్నారు. ఈ నెల 11, 12, 13 తేదీలలో కర్నూల జిల్లా, నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రణవి పాల్గొంటారన్నారు. అదేవిధంగా గత నెల 30వ తేది పుత్తూరు మండలం, గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నెట్ బాల్ జిల్లా పోటీలలో వై.నీలిమ, టి.ఇందుశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 11, 12, 13 తేదీలలో నెల్లూరు జిల్లా, ఆత్మకూరు జరిగే రాష్ట్ర స్థాయిపోటీలలో పాల్గొంటారన్నారు

## ఆఫీస్ ఆటోమేషన్ కోర్సుకు దరఖాస్తు ఆహ్వానం

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమార్

చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:

ఆటోమేషన్ కోర్సులో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ కోరారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు సోమవారం వివరాలు వెల్లడించారు. కళాశాలలో ఆఫీస్ ఆటోమేషన్ (ఎంఎస్ ఆఫీస్) కోర్సు ఈ నెల 17 నుండి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఆటోమేషన్ కోర్సు చేసిన వారికి స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించగలవన్నారు. శిక్షణ కోరే అభ్యర్థులు ఫీజు రూ.6000/-లు చెల్లించాలన్నారు. శిక్షణ అనంతరం ఎస్.బి.టి.ఇ.టి. ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కోర్సు చేయడానికిపదవతరగతిఉత్తీర్ణతఅర్హతగాతెలిపారు.మరిన్ని వివరాలకు 9505119866ను సంప్రదించాలని కోరారు.

## జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి (విద్య), జనవరి 1, ప్రభాతవార్త

స్థానిక తిరుపతి వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో 2023 - 2024 విద్యా సంవత్సరంకు జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తుల సమాచారం కొరకు విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 2022 - 2023 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు 6వ తరగతిలో చేరుటకు అర్హులని తెలిపారు. జాతీయ స్థాయిలో 29.04.2023న ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేది 30.01.2023 అని తెలిపారు. 2022 నవోదయ ఫలితాల్లో జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకుతో పాటు 57 మంది విశ్వం విద్యార్థులు ఎంపిక అయారనితెలిపారు.వివరాలకు 8688888802, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నితిష్ ఎంపిక

నింద్ర,జనవరి 2 ప్రభాతవార్త :



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నింద్రకు చెందిన ఈశాకు జ్యోతి దంపతుల కుమారుడు నితీష్ ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివయ్య తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపంజాణి మండలం నిడిగుంటలో జరిగిన యు 17 వాలీబాల్ యస్‌జియఫ్ సెలెక్షన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.సెలక్షన్ వారు కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అన్నారు.

## కాపు నాయకులు హరిరామజోగయ్యకి సంఘీభావం

నింద్ర,జనవరి 2 ప్రభాతవార్త :



కాపులను బిసిలో చేర్చాలని నిరాహారదీక్ష చేస్తున్న మాజీ మంత్రివర్యులు,కాపు నాయకులు హరిరామజోగయ్యకి సంఘీబావం తెలుపుతున్నట్లుగా నగరి నియోజకవర్గ కాపు యువజన సేవ సంఘం అధ్యక్షులు కన్నివేలు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపులు చాలా మంది పేదరికంలో వున్నారని వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కాపులను బిసిలో చేర్చాలని డిమాండ్ చేసారు.హరిరామజోగయ్య న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని అన్నారు.కార్యక్రమంలో క్రిష్ణయ్య,రాజేంద్రన్,స్వర్ణ,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో నగరి డిగ్రీ కళాశాల విద్యార్థులు

నగరి, జనవరి 2 ప్రభాతవార్త:



యువజన సర్వీసుల శాఖ, సెట్విన్, చిత్తూరు ఆంధ్రప్రదేశ్ వారిచే నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జానపద గీతం(బృందం)లో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశం దక్కిందని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో కళాశాల విద్యార్థినులు మాధవి, మమత, హారతి, రిషిత, ధాత్రి, మంజు, హరిత, సాము, సూర్య, కరుణకుమార్‌లు పాల్గొని ప్రతిభకనబరచి ప్రశంసా పత్రాలు పొందారు. విద్యార్థులను కల్చరల్ కో-ఆర్డినేటర్ డా. ఎం.అరుణకుమారిలను ప్రిన్సిపాల్ డా. ఆర్.వేణుగోపాల్, రమణారెడ్డి, షర్మిల, సుహాసిని, బాషా, ఇతర అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థికి ప్రశంస

నగరి, జనవరి 2 ప్రభాతవార్త:



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు ఎంపికైన పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఏ.కార్తిక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశంసించారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కార్తిక్ పెద్దపంజాణి మండలంలోని జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో చక్కటి ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. సోమవారం విద్యార్థిని, అతనికి తర్ఫీదునిచ్చి వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.గీతమ్మను ప్రధానోపాధ్యాయురాలు ఎం.సునీత అభినందించారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

నగరి, జనవరి 2 ప్రభాతవార్త:

మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటల నుంచే భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వైకుంఠ ద్వారం దర్శనం చేసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరడంతో స్వామి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. డీవైఈవో నాగరత్నం, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సలహా కమిటీ సభ్యులు ఆలయం వెలుపల అన్నదానం చేశారు. రాజీవ్‌నగర్ కొండపై ఉన్న షిరిడీ సాయి దివ్యదామంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. తెరణి గ్రామంలో అతిప్రాచీన దేవాలయమైన వైకుంఠనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి గరుడవాహన సేవ నిర్వహించారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని ప్రయాగ మాధవస్వామిని, సత్రవాడలో కరివరదరాజ ఆలయంలోని కరివరదరాజస్వామిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే ప్రసన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని చేసిన అలంకరణలు భక్తులను అబ్బురపరచాయి.



## కన్నుల పండువగా మనోన్మణి గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల్లో భాగంగా ఆదివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా గౌరమ్మ గ్రామోత్సవంను కన్నుల పండు వగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకార మండపంలో ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం నుంచి రాజగోపురం నుంచి వాహనాల మండపంలో వాహనంపై అధిరోహింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, దఫేదార్ రాజాలు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ట్రాఫిక్‌ను ఎఎస్ఐ జనార్ధన్‌నాయుడు పర్యవేక్షణలో నిర్వహించారు. ఊరేగింపు నాలుగుమాడావీధుల్లో సాగింది. కార్యక్రమంలో పలువురు ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

# కుప్పంలో రేపటి నుంచి చంద్రబాబు పర్యటన

-మూడు రోజుల మకాం..
రోడ్‌షోలు.. బహిరంగసభ..
కార్యకర్తల సమావేశాలు!



కుప్పం, జనవరి 2 ప్రభాతవార్త : ప్రతిపక్ష నేత, తెదేపా జాతీయ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈనెల 4-6 తేదీల్లో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు కుప్పంలో మకాం వేయనున్నారు. రోడ్‌షోలు, బహిరంగసభ, కార్యకర్తల సమావేశాలకు ఈపర్యటనలో ప్రాధాన్యత ఇచ్చారు. కుప్పంలో చంద్రబాబు పర్యటన ఇలా.. ఈనెల 4వతేది ఉదయం 10 గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడనుంచి దేవనహళ్లి మీదుగా మధ్యాహ్నం 2గంటలకు శాంతిపురం మండలం 121 పెద్దూరు చేరుకుంటారు. 3గంటలకు బెండనకుప్పం, 3.45 గంటలకు చెంగుబళ్ల క్రాస్‌లో రోడ్‌షో నిర్వహిస్తారు. 4గంటలకు శివకురుబూరులో ఇదేం ఖర్మ కార్యక్రమం చేపడ్తారు. 5గంటలకు శెట్టిబళ్ల క్రాస్, 6గంటలకు కెనమాకులపల్లిలో రచ్చబండ కార్యక్రమం చేపడతారు. 7గంటలకు శాంతిపురం చేరుకుని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగసభలో ప్రసంగిస్తారు. 8.30గంటలకు శాంతిపురం నుంచి బయలుదేరి కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. 05న ఉదయం 10.30 గంటలకు ప్రజలనుంచి ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో వినతులు స్వీకరిస్తారు. 11గంటల నుంచి గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, కుప్పం మున్సిపాలిటీ క్లస్టర్ నేతలు, కార్యకర్తలతో అక్కడే సమావేశమవుతారు. 6న ఉదయం 10.30గంటలకు ప్రజలనుంచి వినతుల స్వీకరణ, 11గంటలకు గుడుపల్లె బయలుదేరుతారు. 11.30గంటలకు గుడుపల్లె, 12.30 గంటలకు గుడుపల్లె రైల్వేస్టేషన్ క్రాస్‌లో రోడ్‌షోలో ప్రసంగిస్తారు. 2.30 గంటలకు పెద్దగొల్లపల్లి, 2.45 గంటలకు సి.గొల్లపల్లి, 3.15గంటలకు ఎం.కొత్తూరు, 4.30 గంటలకు సంగనపల్లి, 5.30గంటలకు పెద్దపర్తికుంటలో పర్యటించి ప్రసంగిస్తారు. 6గంటలకు పెద్దపర్తికుంట నుంచి బయలుదేరి వేపనపల్లి, హొసూరు మీదుగా 8గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.

# అమర్నాథ్ రెడ్డి చేయని అభివృద్ధి నేనుచేసి చూపిస్తున్నా : ఎమ్మెల్యే



పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడా

పెద్దపంజాణి జనవరి 2 ప్రభాతవార్త :తెలుగుదేశం పార్టీ పాలనలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమిత మైతే మూడున్నరఏళ్ళ వైకాపా పాలనలో తాము లక్షలాధి రూపాయలతో అభివృద్ధి పనులను చేస్తూ వాటిని ప్రారంభిస్తున్నామని ప్రజలకు అభివృద్ధి ఎవరు చేసారో బాగాతెలుసనని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. సోమవారం పెద్దపంజాణిలో వైయస్సార్ నూతన పెన్షల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తనపై మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి చేసిన వాఖ్యలకు కొంచెం ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. తెదేపా హయాంలో మంత్రిగా పనిచేసిన అమర్నాథ్ రెడ్డి చేయని అభివృద్ధిని సిఎం జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల ఆశీస్సులతో తాను పలమనేరు నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపుతున్నట్లు పేర్కొన్నారు. మంత్రిగా తనస్వంత గ్రామంలో ఓ అంగన్‌వాడి కేంద్రాన్ని సైతం పూర్తిగా నిర్మించక హడావిడిగా ప్రారంభించింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. అమర్నాథ్ రెడ్డి తనపై చేసిన వాఖ్యలు గురువింద సామెతను గుర్తు చేస్తాయన్నారు. అభివృద్ధి పనులకు ఒక్కతట్ట మట్టి వేయలేదని పేర్కొన్న అమర్నాథ్ రెడ్డి స్వగ్రామం కెళవాతిలోనే 40లక్షలతో సచివాలయ భవణం నిర్మించి ప్రజలకు సేవలు అందిస్తున్నది మాజీ మంత్రి కనులకు కన్పించదా అని ప్రశ్నించారు. గతంలో కేవలం అమర్నాథ్ రెడ్డి శిలాఫలకాలను ప్రారంభించారే తప్ప పనులను ఎందుకు పూర్తి చేయించ లేదని ప్రశ్నించారు. మంత్రిగా పని చేసిన వ్యక్తి నోట బూతుమాటలను మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండలకేంద్రంలో స్త్రీ శక్తిభవణం ప్రాంగణంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన నూతనంగా 327 మంది లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఖలీల్, ఎంపిపి రెడ్డెప్ప. జెడ్పీటీసీ సుష్మాకీర్తి, మండల కన్వీనర్ బాగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప, జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, సుహేబ్, ఎర్రబల్లి శ్రీనివాసులు, శివాడి సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ సర్పంచులు, ఎంపిటీసీలు, మండస్థాయి అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్పలాయగుంటలో వైకుంఠ ఏకాదశి



వడమాలపేట, జనవరి 2 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఆలయం సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో కలకలాడింది. నూతన సంవత్సరం వైకుంఠ ఏకాదశి పక్కనే రావడంతో రెండు రోజులు భక్తులతో అప్పలాయగుంట నిండిపోయింది. సోమవారం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయంనుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు



తడ, జనవరి 2 ప్రభాతవార్త : తడ మండలంలోని పలు వైష్ణవాలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేనాడు దీవిలోని శ్రీరంగ పెరుమాళ్ ఆలయంలో ఉత్తరద్వార దర్శనం కోసం దీవి ప్రజలతో పాటు సమీప ప్రాంతాల భక్తులు కూడా బారులు తీరారు. ఈ చారిత్ర ప్రశస్తి చెందిన ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి దాకా భజన పాటలు పాడుకుంటూ పరవశించారు. తడ మండలం పన్నంగాడులోని ప్రసన్నాంజ నేయస్వామి ఆలయం, బోడిలింగాలపాడు వద్దనున్న శ్రీసీతారామ సమేత ఆంజనేయస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. తడ పంచాయతీ పరిధిలో ఉన్న వేంకటేశ్వరాలయం, తడకండ్రిగలోని శ్రీనివాస పెరుమాళ్ ఆలయాలలోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిపారు.

## కరిమాణిక్యస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



నాయుడుపేట రూరల్, జనవరి 2 ప్రభాతవార్త : నాయుడుపేటలోని తుమ్మూరులో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరిమాణిక్యస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. శ్రీకరిమాణిక్యస్వామి గరుడ వాహనంపై రాజగోపుర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నాదస్వర కచ్చేరి, భక్తి భజన సంకీర్తనలు, కోలాట భజనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

## ఘనంగా గరుడసేవ ఉత్సవం



చిల్లకూరు జనవరి 1 ప్రభాతవార్త : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసియున్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చి దిద్దారు. ఉత్తర ద్వారగుండా భక్తులు ప్రవేశించి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. దాతలు నెల్లూరు నగరానికి చెందిన ఔకు శ్రీకాంత్, ధర్మపుష్పలత, సాయింత్రం గరుడసేవ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదే విధంగా స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు నరసింహరావు , విలీనా, ఉభయకర్తలుగా వ్యవహారించారు. ఈకార్యక్రమాలకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారు గరుడ వాహనంపై కొలువదీరిగా మాడవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమాలను ఆలయ చైర్మన్ కందల ఆనంద్ , ఇఒ నవీన్‌కుమార్‌లు దగ్గరుండి ఏర్పాట్లు చేయడం జరిగింది.

## అవ్వాతాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, జనవరి 2 ప్రభాతవార్త : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవ్వాతాతల సంక్షేమమే లక్ష్యంగా అర్హులందరికీ పెన్షన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో, మండల పరిధికి సంబంధించి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 1వ తేదీ నాటికి అర్హులందరికీ పెన్షన్లు అందజేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ సదుపాయాన్ని ప్రస్తుతం 250 రూపాయలు పెంచి అవ్వాతాతలకు అందజేస్తు న్నారని చెప్పారు. కొంతమంది పెన్షన్లు తొలగించామని విష ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి వారి మాటలను ప్రజలు విశ్వసించవద్దని సంజీవయ్య చెప్పారు. అర్హులందరికీ పెన్షన్ అందజేస్తూనే ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపిడిఓ ప్రమీల, కమిషనర్ నాగిశెట్టి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోకి కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, జనవరి 2 ప్రభాతవార్త:కలెక్టర్ హరినారాయణన్ సోమవారం విధుల్లో చేరారు. ఇటీవల వ్యక్తిగత కారణాలతో కలెక్టర్ హరినారాయణన్ పది రోజుల పాటు సెలవు పెట్టడంతో ఇన్‌ఛార్జీ కలెక్టర్‌గా జెసి వెంకటేశ్వర్ వ్యవహరించారు. కలెక్టర్ సోమవారం తిరిగి రావడంతో ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టర్ హరినారాయణన్‌కు బాధ్యతలు అప్పగించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ భరత్



కుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త : వైకుంఠ ఏకాదశి పర్వదినం అయిన సోమవారం నాడు చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ తిరుమల శ్రీవారిని కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆయన స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారిని ఎమ్మెల్సీ భరత్‌తో పాటు ఆయన సతీమణి శ్రీమతి దుర్గా పద్మిని, రిటైర్ట్ ఐజి ఎంకె సింగ్ దంపతులు దర్శించుకున్నారు.

## టిడిపితోనే రాష్ట్రఅభివృద్ధి సాధ్యం :మాజీ మంత్రి



పలమనేరు, జనవరి 2, ప్రభాతవార్త: టిడిపితోనే రాష్ట్రా అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు. మండలంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యాక్రమంలో భాగంగా కొలమాసనపల్లెలో సోమవారం ఆయన పర్యటించారు. ఈక్రమంలో అధికసంఖ్యలో ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు తీరని ద్రోహం చేస్తుందని ఇప్పటికైన ప్రజలు క్రహించాలని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి మరచి ప్రభుత్వం సంక్షేమాలు ప్రజలకు అందిస్తున్నామని తెలపడం సరికాదని, రాష్ట్రం అభివృద్ధి చెందితే రాష్ట్ర యువతకు ఉపాధిఅవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి చొప్పుకునేలా ఒక్క పరిశ్రమ రాలేదని, సంక్షేమ పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వం తాకట్టు పెట్టడం జరుగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు రెడ్డి, గణేష్, సెల్వా, జగదీష్‌నాయుడు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి



బంగారుపాళ్యం, జనవరి 2 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి పర్వదినంను ప్రజలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను వివిధ పుష్పాలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తులసీ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే నలగాంపల్లి దేవరకొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వారా ప్రవేశం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు



చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పర్యవేక్షణలో భక్తులకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రద్దీ దృష్ట్యా తిరుమల తరహాలోనే ఆలయంలో భక్తులకు మహాలఘు దర్శనం అమలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు వైకుంఠవాకిలి ప్రవేశంతో సంతృప్తి చెందారు. ఆలయంలో ఏఈఓ గురుమూర్తి, ఏఎల్ఓ పి.యుగంధర్ రెడ్డి, సూపరిటెండెంట్స్ మునిచెంగల్రాయలు, టి.వెంకటస్వామి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సురేష్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి ఆర్థితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి రోజున శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



## ఉత్తర ద్వార దర్శనం సర్వశుభాలకు నిలయం

-వైకుంఠ ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్త జనం



శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంలో వెలసిన ప్రసన్నవరదరాజస్వామి ఆలయం సోమవారం వైకుంఠ ఏకాదశి స ందర్భంగా భక్తులతో కిట కిట లాడింది. శైవ క్షేత్రంలో వెలసిన ఒకే ఒక ఆలయం ప్రసన్న వరదరాస్వామి ఆలయం. శ్రీకాళహస్తీశ్వ రాలయంకు అనుబంధంగా ఉన్న ప్రసన్నవరదరాజస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో ఇఓ వికె సాగర్ బాబు సూచనలతో ఏర్పాట్లు చేపట్టారు. కాగా ప్రసన్న వరదరాజస్వామి దర్శనం తరువాత శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనాధుని భక్తులు మనసారా దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారాల్ని చక్కగా తీర్చి దిద్దారు. స్వామి అమ్మవార్ల ముస్తాబులు ఇట్టే భక్తుల్ని ఆకట్టుకుంది. ఇక్కడ పూజారి శ్రీనివాసాచార్యులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాల్ని అందించారు. ఇక పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు ప్రసాదాల్ని ఉచితంగా అందించారు. ఆలయ ఇఓ సాగర్‌బాబు సూచనలతో ఆలయాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వచ్చిన భక్తులు సుదర్శనం చేసుకున్నారు. కాగా శ్రీకాళహస్తీశ్వరుని ఆలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరు గ్రామంలో వెలసిన చెన్న కేశవ స్వామి ఆలయంలో ఉదయం అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

## అమ్మవారి సేవలో ప్రముఖులు



తిరుచానూరు, జనవరి 2 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా॥మేరుగ నాగార్జున, రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకానాథ్ షిండే వేర్వేరుగా దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వాద మండపంలో వేదాశీర్వచనంతో పాటు, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, అర్చకులు బాబు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరునికి బంగారు కాసుల హారం బహూకరణ



శ్రీకాళహస్తిరూరల్, జనవరి 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులతో కిట కిట లాడింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలే కాకుండా శ్రీకాళహస్తి పట్టణం నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వేకువ జాము నుంచే టిటిడి ప్రత్యేకంగా రూపొందించిన క్యూలలో నిరీక్షించారు. తిరుమలలో దర్శనానికి ఆంక్షలు సమీపంలోని ఆలయాలకు వరంగా మారింది. తిరుమల వెళ్ళి గంటల కొద్ది నిరీక్షించే బ దులు ప్రశాంతంగా మనసార ప్రశాంతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకోవచ్చుననే భావంతో శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల నుంచి వైష్ణవ భక్తులే కాకుండా శివ భక్తులు కూడా భారీ ఎత్తున తరలి వచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా టిటిడి భక్తులకు సుదర్శనంతో పాటు ఉచిత ప్రసాదాల్ని అందించారు. పలువురు ఇక్కడ దార్మిక కార్యక్రమాల్ని నిర్వహించారు.

# స్పందన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి:మేయర్



బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అనుపమ

తిరుపతి, జనవరి 2, ప్రభాతవార్త : స్పందన ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా సత్వరమే పరిష్కరించేలా పని చేయాలని అధికారులనుద్దేశించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో మేయర్ చేస్తూ, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన మేయర్ డా.శిరీష సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫిర్యాదుదారులకు హామీ ఇస్తూ వారిచ్చిన పిర్యాదులపై తక్షణమే తమ అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపడుతారని హామీ ఇచ్చారు. నిర్మాణం జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మూలలో ప్రధాన రహదారిపై బట్టల షాపు, ఆధార్, ఫాన్ కార్డు సర్వీస్ సెంటర్లు వ్యాపారాలు సాగిస్తున్నారని, ఇందువలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయనే ఫిర్యాదుపై మేయర్ శిరీష స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. టీచర్స్ కాలనీలోని తమ స్థలంలోకి ప్రక్కనున్న అపార్ట్మెంట్ వారు మురికి నీరు వదులుతున్నారని, క్రాంతి నగర్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలని, ఎల్‌బి నగర్‌లో రోడ్డుపైనే బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్స్ వేస్తున్నారని, ఎల్ఐసి రోడ్డులో బిటి రోడ్డు వేసేందుకు మూడు నెలలు క్రింత త్రవ్వి వెట్ మిక్స్ వేసి వదిలేయడంతో దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని, తిమ్మినాయుడు పాళెంలోని తమ ప్లాట్‌ను ఆక్రమిస్తున్నారని, సర్వే చేయించాలనే ఫిర్యాదులపై మేయడ్ డాక్టర్ శిరీష స్పందిస్తూ పరిశీలించి తమ అధికారులు తగు చర్యలు తీసుకుం టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతు మాదవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మేనేజర్ చిట్టి బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ షణ్ముగం, మున్సిపల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రావు, సూపరింటెండ్ పి.రవి తదితర అధికారులు పాల్గొన్నారు.